నవతెలంగాణ

నవ్యత తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

బుధవారం | ఏప్రిల్ 3, 2024 | www.navatelangana.com

గుడుంబా స్వాధీనం చేసుకున్న టాస్క్ ఫోర్స్

నవతెలంగాణ-కామారెడ్డి

మాచారెడ్డి మండలంలో గుడుంబా కల్తీ సారా విక్రయిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు జిల్లా ఎస్పీ సింధు శర్మ ఆదేశాలతో టాస్క్ ఫోర్స్ సీఐ తిరుపయ్య తమ సిబ్బంది తో సోమార్ పేట్ గ్రామానికి వెళ్ళి అక్కడ చిట్టావోయిని నర్సయ్య అను వ్యక్తి గుడుంబా (కల్తీ సారా) అమ్ముతుండగా పట్టుకున్నారు. అతని వద్ద 8.5 లీటర్ల గుడుంబా (కల్తీ సారా) స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. గుడుంబా (కల్తీ సారా) తయారు చేసే వ్యక్తి మాచారెడ్డి మండలం నెమలిగుట్ట తండా కు చెందిన హీన వద్ద 200 లీటర్లు తయారీలో ఉన్న ముడి సరుకు (గుడుంబా)ను పట్టుకొని పారబోసినట్టు తెలిపారు. ఇద్దరిపై మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న గుడుంబా

మరుగుదొడ్ల నిర్మాణంపై ఆర్టీఐ దరఖాస్తు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని అంగడి బజార్ సమీపంలో ఇటీవల కాలంలో నిర్మించిన మరుగుదొడ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని పట్టణానికి చెందిన శ్రీనివాస్ పంచాయతీ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్ కు అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ మరుగుదొడ్ల నిర్మాణంలో భారీ మొత్తంలో అవినీతి జరిగిందని పూర్తి సమాచారం అందిన తర్వాత అవినీతి కారణమైన అధికారులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు.



ఆర్టీఐకు దరఖాస్తు అందజేత



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

వేసవి సెలవులు ముగిసేలోగా స్కూళ్లల్లో మరమ్మతులు పూర్తిచేయించాలి

- అమ్మ ఆదర్శ పాఠశాల అమలుపై కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సమీక్ష

నవతెలంగాణ-కామారెడ్డి

వేసవి సెలవులు ముగిసేలోగా జిల్లాలోని ఆయా పాఠశాలల్లో మరమ్మతు పనులు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల అమలు, కమిటీల ఏర్పాటు, పనులు చేయించే విధానంపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయములోని సమావేశ మందిరంలో నీటి పారుదల, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ, మున్సిపల్, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ, ప్యాకేజీ-9 ఈఈల తో కలిసి కలెక్టర్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో 1013 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల అమలు చేస్తున్నట్టు తెలిపారు. హెచ్ఎమ్, మహిళా సంఘాలలోని సభ్యులతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ కమిటీ ఆధ్వర్యంలో స్కూల్‌లలో తాగునీరు, తరగతి గదుల్లో చిన్న చిన్న మరమ్మతులు, టాయిలెట్లు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తదితర సమస్యలను గుర్తించాలని ఆదేశించారు. ఆ కమిటీల ఆధ్వర్యంలో అన్ని మరమ్మతు పనులు చేయించాలని ఆదేశించారు. జాతీయ బ్యాంక్ లలో ఖాతాలు ఓపెన్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, పీఆర్ ఈఈ సదాశివరెడ్డి, పరీక్షల విభాగం అధికారి లింగం, మండల విద్యాశాఖ అధికారి ఎల్లయ్య, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



వృథాగా పోతున్న భగీరథ నీరు

భగీరథ లీకేజీతో నీరు వృథా

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రం అంచనూరు గ్రామం మధ్యలో ఉన్న రహదారి పక్కన ఉన్న మిషన్ భగీరథ పైప్ లైన్ లీక్ కావడంతో కొన్ని రోజులుగా నీరు వృథాగా పోతోంది. పైప్‌లైన్ లీకేజీతో నీరు కలుషితం అవుతోంది. వాటి వల్ల ప్రజల అనారోగ్యంతో ఇబ్బందులు పడే అవకాశం ఉంది. అయితే భగీరథ పైప్ లైన్ లీకేజీ అయిందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ మీనాకు ఫోన్ చేయగా.. అందుబాటులోకి రాలేదు.



పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

పరిహారానికి పడిగాపులు



నేలవాలిన వరి పంట



రైతులతో మాట్లాడుతున్న మంత్రి (ఫైల్)

- పంటచేతికొచ్చే సమయంలో భారీ వర్షంతో ఆరు గ్రామాల్లో 100 శాతం పంటల నష్టం
- నిండమునిగిన రైతులు
- నష్టపరిహారం కోసం ఎదురుచూపులు

నవతెలంగాణ-భిక్కనూర్

పంటలు చేతికొచ్చే సమయంలో గత నెల 16వ తేదీన కురిసిన వర్షాలకు ఏకంగా ఆరు గ్రామాల్లోని పంటలకు పూర్తిగా నష్టం వాటిల్లింది. తమను ఆదుకోవాలని రైతులు హైవేపై ఆందోళన చేపట్టారు. దీంతో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణరావుతో పాటు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు ఇతరులు పంటలను పరిశీలించారు. నివేదిక ప్రభుత్వానికి అందజేసి ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఇదంతా గడిచి 15 రోజులవుతున్నా.. ఇప్పటికీ పరిహారంపై రైతులకు భరోసా కల్పించిన దాఖలాలు లేవు.

20 రోజుల్లో పంట చేతికి వస్తున్న తరుణంలో తమ కష్టానికి ప్రతిఫలం అందుతుందని రైతులు ఎంతో ఆశతో ఎదురుచూశారు. కానీ అకాల వర్షం వారి ఆశలను అడియాశలు చేసింది. వడగండ్లతో కూరిసిన భారీ వర్షానికి కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలంలోని ఆరు గ్రామాల్లో పెద్దమొత్తంలో పంటలకు నష్టం వాటిల్లింది. వరి, మొక్కజొన్నతో పాటు పొద్దుతిరుగుడు, బొప్పాయి, కర్బుజ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

వ్యవసాయ అధికారుల ప్రకారం అంతంపల్లిలో 501.37 ఎకరాలు, జంగంపల్లి-486.20, లక్ష్మీదేవుని పల్లి-183, రామేశ్వర్ పల్లి, తిప్పాపూర్-671.38, పెద్దమల్లారెడ్డి- 31.21, భిక్కనూర్-898.26, కాచాపూర్-293 మొత్తం-3,065.02 ఎకరాలలో పంట నష్టం వాటిల్లినట్టు నివేదిక రూపొందించారు. అనధికారికంగా మరింత నష్టం వాటిల్లినట్టు రైతులు పేర్కొన్నారు. అలాగే మామిడి, కూరగాయల పంటలు 567 ఎకరాలలో పంట నష్టం జరిగిందని హార్టికల్చర్ అధికారులు తెలిపారు.

చేతికి అందే తరుణంలో పంటలు పూర్తిగా కొట్టుకుపోవడంతో తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సదరు గ్రామాల రైతులు గత నెల 19వ తేదీ నాడు అంతంపల్లి గ్రామ శివారులో 44 జాతీయ రహదారిపై 6 గ్రామాల రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న జిల్లా అధికారులు, పోలీసులు వ్యవసాయ అధికారుల చేత పంట నష్టం వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.



రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్)

ప్రభుత్వం నుండి పంట నష్టం జరిగిన గ్రామాలను జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యవసాయ పంటలను పరిశీలించి పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రస్తుతం ఎకరానికి 10000 చెల్లిస్తామని, పార్లమెంట్ ఎలక్షన్ తర్వాత ప్రభుత్వం చర్చించి 25 వేల వరకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా ఇచ్చి వెళ్లారు. మంత్రి వెంట ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని రైతులు అందరూ అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు ప్రతి గ్రామంలో నష్టపోయిన పంటలను పరిశీలించి పూర్తి వివరాలను జిల్లా అధికారులకు సమర్పించారు. పది రోజుల్లో పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎకరానికి పదివేల రూపాయలు పంట నష్టపరిహారం రైతులకు అందజేస్తామని ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారే కానీ నేటికీ ఒక్క రైతు ఖాతాలో కూడా పంట నష్టపరిహారం అందలేదని బాధిత గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్, ఇతర ప్రజా ప్రతినిధులు అన్నదాతలను పరామర్శించడమే తప్ప ఆదుకున్న పాపాన పోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. 20 రోజుల్లో పంట చేతికి వస్తుంది అనుకునే సమయంలో పూర్తి పంట నష్టం కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, ప్రభుత్వం స్పందించి ఇచ్చిన మాట ప్రకారం పంట నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుచున్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

అకాల వడగళ్ల వాన కారణంగా 12 ఎకరాల్లో వరి వేసిన వరి పూర్తిగా నష్టం జరిగింది. పంట పెట్టుబడి మూడు లక్షల అరవై వేల ఖర్చు అయింది. నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటానని హామీ ఇచ్చిందే కానీ ఇంతవరకు ఎలాంటి పంట నష్టపరిహారం అందలేదు. పంట నష్ట జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.



సంజీవరెడ్డి అంతంపల్లి

పంట నష్టం చెల్లించకుంటే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

అకాల వర్షం కారణంగా భిక్కనూరు మండలంలో 6 గ్రామాల్లోని రైతులకు తీవ్రంగా పంట నష్టం జరిగింది. జిల్లా మంత్రి పంట నష్టం ప్రాంతాలను పరిశీలించారే కానీ ఇంతవరకు రైతులకు నష్టపరిహారం చెల్లించలేదు. ప్రజలకు అన్నం పెట్టే రైతన్నను ఆదుకునే బాధ్యత పాలకులపై, అధికారులపై ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలి. లేకుంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని రైతుల ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు.



వెంకట్ గౌడ్ సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

మొత్తం కొట్టుకుపోయింది

13 ఎకరాల్లో 7 ఎకరాల వరి, 6 ఎకరాల మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకొని ఇచ్చిన హామీ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రైతులకు న్యాయం జరిగే విధంగా పంట నష్టపరిహారం చెల్లించాలి. కనీసం పెట్టుబడి సహాయం రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలి.



మధు మోహన్ రెడ్డి అంతంపల్లి

పసికందులకు వ్యాక్సిన్ కొరత

- పీహెచ్‌సీలతో పాటు జిల్లా ఆస్పత్రిలో సైతం అందని వైనం
- 45 రోజులుగా లేకున్నా.. పట్టించుకోని యంత్రాంగం
- సకాలంలో టీకాలు ఇవ్వకపోతే.. రోగనిరోధక శక్తి తగ్గి, రోగాలబారిన పడే ఛాన్స్



టీకా కోసం శిశువుతో ఆస్పత్రికి వచ్చిన తల్లిదండ్రులు

నవతెలంగాణ-మోపాల్

పుట్టిన పిల్లలకు నెల తర్వాత " పెంట వ్యాక్సిన్" అనే రోగ నిరోధక శక్తిని పెంపొందించే వ్యాక్సిన్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే గత 45 రోజుల నుండి వివిధ మండలాల ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్లలో అందుబాటులో లేవు. 20 రోజుల నుంచి జిల్లా ఆస్పత్రిలో సైతం అందుబాటులో లేకపోవడం గమనార్హం.

పాలకులకు చిన్నపిల్లల వ్యాక్సిన్ ల పైన చిత్తశుద్ధి లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు సైతం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాకు ముఖ్యమైనటువంటి ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటువంటి వ్యాక్స్ 20 రోజుల నుంచి లేకున్నా కూడా నిమ్మకు నీరెత్తినట్టుగా ఉన్నారు. చాలామంది పేదవారికి ప్రవేట్ ఆసుపత్రిలో కొనే స్తోమత లేక ప్రభుత్వ ఆసుపత్రిపై ఆధారపడి ఉంటే ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్ల పిల్లలు చిన్ననాటి వయసు నుండే రోగాల బారిన పడే అవకాశం ఉంది. చాలామంది చిన్న పిల్లల తల్లిదండ్రులు ప్రైమరీ హెల్త్ సెంటర్ల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోతున్నారు. ఆ మండలానికి సంబంధించిన ఏఎన్ఎం జీఎన్ఎమ్ మీ ఆ మండలాలకు సంబంధించిన వారు కోరగా పైనుండి రావడం లేదు వచ్చాక మీకు చెప్తామని దాటవేస్తున్నారు.

ఒక వ్యాక్సిన్ నెల రోజు నుండి లేకపోయినా కూడా ఎవరు పట్టించుకోవడం లేదంటే జిల్లా పాలన ఎంత దౌర్భాగ్యస్థితిలో ఉందో అర్థమవుతుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ కానీ సంబంధించిన డిఎంహెచ్ఓ కానీ ఉన్నత అధికారులతో మాట్లాడి అభం శుభం తెలియని చిన్న పిల్లల ప్రాణాలతో చెలగాటాలు ఆడకుండా వారిపై దయచూపి వ్యాక్సిన్ అందుబాటులో తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈ పెంట వ్యాక్సిన్ అనే ఇంజక్షన్ శిశువుకు నెల తర్వాత ఒకసారి 75 రోజుల తర్వాత రెండవసారి, మూడు నెలల కాలంలో మూడవసారి ఇవ్వాలి. సరైన సమయంలో ఇవ్వకపోవడం వల్ల వారిలో రోగ నిరోధక శక్తి తగ్గిపోయి ప్రతి క్షణం ఆసుపత్రి పాలు కావాల్సి వస్తుంది.

కేవలం ప్రభుత్వాధికారుల నిర్లక్ష్యం వల్ల చిన్నపిల్లల రోగాల బారిన పడవలసి వస్తుంది. ఒకానొక సందర్భాలలో మండల ప్రైమరీ హెల్త్ సెంటర్లో లేకపోయినా జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించేవారు. కానీ ఎక్కడా అందుబాటులో లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చుట్టుపక్కన ఉన్న పీహెచ్‌సీల్లో ఆరా తీస్తున్నా.. అక్కడి నుంచి సైతం లేవనే సమాధానం వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యాక్సిన్ తెప్పించాలని కోరుతున్నారు.

రోడ్డుపై పారుతున్న సాగునీరు

- కాలువ పూడిక తీత చేపట్టకపోవడంతో వృథాగా పోతున్న వైనం

నవతెలంగాణ-మోర్తాడ్

పంట చేలకు వెళ్లాల్సిన సాగునీరు.. అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డుపై, కాలనీల్లో ప్రవహిస్తుంది. చెరువు నీరు కాలువల ద్వారా విడుదల చేసిన క్రమంలో.. పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో నీటి ప్రవాహం కారణంగా కాలువపై నుంచి పారుతూ రోడ్డుపై, నివాస ప్రాంతాల్లోకి వెళ్తుంది. ఇంత జరుగుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువైయ్యాడు.

మండల కేంద్రంలోని ముసలమ్మ చెరువు నుండి నీటిని పంటల కోసం విడుదల చేశారు. అయివదిలిన నీరు పంట పొలాలలోకి చేరకుండా రహదారిపై భారీ ప్రభావంతో పారుతున్న వాటిని పట్టించుకునే నాథుడే కరవయ్యారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ముసలమ్మ చెరువు నుండి నలుమూలల పంట పొలాల క్షేత్రాలకు నీటిని 20 రోజుల క్రితం వదిలారు. గ్రామ చివరిలో ఉన్న పంట పొలాలకు నీరు సరఫరా అందడం లేదని రైతుల ఆందోళన ఆవేదనతో నీటి ప్రవాహాన్ని పెంచారు. నీటి ప్రవాహం పెంచడంతో బాలికల ఉన్నత పాఠశాల వెనుకలా ఉన్న కాలువ నుండి నీరు గృహ నివాసాలకి చేరుతున్నాయి. గత వారం రోజుల నుండి నీటి ప్రవాహం పంటపొలాలలోకి కాకుండా వృథాగా మారి నివాస ప్రాంతానికి చేరుతున్నాయని కాలనీవాసులు ఎంత చెప్పినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. నీటి ప్రవాహం తగ్గించి కాలువలలో ఉన్న పూడికతీతను తొలగించి పంటపొలాలకి నీరు సక్రమంగా వెళ్లే ప్రయత్నం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కాలనీల్లో ప్రవహిస్తున్న సాగునీరు

కుల బహిష్కరణపై సీపీ సీరియస్

- 10 మందిపై కేసు నమోదు
- నవతెలంగాణ కథనానికి స్పందన.. బాధితులకు ఊరట

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రానికి చెందిన గౌడ కులస్థులు, తమ కులంలో రెండు కుటుంబాలకు గత 15 నెలలనుండి కొనసాగుతున్న కుల బహిష్కరణ సంఘటనలో నవతెలంగాణలో ప్రచురితమైన కథనంలో సిపి కమలేశ్వర్ సీరియస్ అయినట్లు తెలిసింది. దీంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో ధర్పల్లి పోలీసులు 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. మంగళవారం సిఐ భిక్షపతి, ఎస్ఐ విక్రమ్ కలిసి ఈతవనాన్ని సందర్శించి, చెట్లను పరిశీలించడంతో పాటు, చుట్టుపక్కల వారితో విచారణ చేపట్టారు. దీంతో బాధితులకు ఊరట కలిగినట్టు అయింది.



అయినప్పటికీ సంఘంవారు తమపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా అధికారులకు తప్పుడు సమాచారంతో ఎప్పుడు ఏంచేస్తారో నని భయభ్రాంతులకు గురవుతున్నట్టు బాధితులు వాపోతున్నారు. సిపి స్పందించి, కులస్థులు విధించిన బహిష్కరణ తొలగించి, తమ భూమిలో ఉన్న చెట్లను తామే గీసుకొని జీవనం కొనసాగించే విధంగా చర్యలు తీసుకొని తమ రెండు కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.

పోలీస్‌స్టేషన్ నుంచి ఇద్దరు దొంగల పరారీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని 6వ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ఇద్దరు దొంగలు మంగళవారం పరారీ అయ్యారు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ మధ్యకాలంలో 6 వ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ఇళ్లలో దొంగతనం చేసిన ముగ్గురిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్నారు. అందులో నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన షేక్ సిరాజ్, నగరంలోని ఆటోనగర్ అక్బర్ బాగ్ చెందిన సయ్యద్ జీషన్ పరారీ అయ్యారు. రాత్రి విధుల సమయంలో పోలీసులు ఎమరపాటుగా ఉండడాన్ని గమనించి పోలీస్ పోలీస్ కస్టడీ నుంచి ఇద్దరు దొంగలు పరారీ అవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వారి కోసం గాలింపు చేపట్టారు. శివారు ప్రాంతాలకు చెందిన పోలీస్ స్టేషన్ ల అధికారులకు సమాచారం ఇచ్చారు. పరారీ అయిన వారిని పట్టుకుని ప్రయత్నంలో ఉన్నారు.



ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్స్

నవతెలంగాణ-పోతంగల్

పోతంగల్ గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా హంగర్గ గ్రామం నుంచి వస్తున్న హంగర్గ గ్రామానికి చెందిన జడల రాజేశ్వర్ ఇసుక ట్రాక్టర్‌ను ఆపి సంబంధిత అనుమతిపత్రాల గురించి విచారణ చేపట్టారు. సరైన అనుమతి పత్రాలు లేకపోవడంతో ఆ ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సొసైటీ సీఈవో



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని హున్సా సొసైటీలో సొసైటీ సీఈఓ హనుమంతరావు పటేల్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్ముకొని మద్దతు ధరను పొందాలని సూచించారు. ప్రభుత్వం క్వింటాకు ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ.2203, కామన్ రకం ధాన్యానికి రూ.2183 మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులు మందర్న రవి, వినోద్ బాబా, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం



నవతెలంగాణ-మోపాల్

మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలోని ఇందూర్ తిరుమల ఆలయంలో శ్రీనివాసుని కల్యాణ ఉత్సవాన్ని మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవదేవుల ఉత్సవమూర్తులను మేళ తాళాలు డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అందంగా ముస్తాబు చేసిన మండపంలో కొలువు తీర్చారు. అనంతరం వేద పండితులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని సంప్రదాయ రీతిలో నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కళ్యాణంలో పాల్గొని శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణంలో పాల్గొంటే కన్యాదాన ఫలం వస్తుందని దేవనాథ జీయర్‌స్వామి వారు అన్నారు. కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. ఉదయం యజ్ఞ కార్యక్రమం ముగిసిన తరువాత స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొనడంతో పరిసరాలు భక్తులతో నిండిపోయింది. కార్యక్రమాల్లో దేవనాథ జీయరు స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజదాస్ స్వామి, ప్రముఖ నిర్మాత శిరీష్, సినీ హీరో ఆశిష్, నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి, నరాల సుధాకర్, రవీందర్ యాదవ్, నర్సారెడ్డి, యాజ్ఞాచార్యులు శిఖామణి, శ్రీకర్ కుమారాచార్యులు, రోహిత్ కుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఉద్యోగ విరమణ



ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించిన కొల్లూరి వెంకట సుబ్బారావు అనే ఉపాధ్యాయుడు మంగళవారం ఉద్యోగ విరమణ చేశాడు. 39 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా ఆయన విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.

పూర్వ ప్రాథమిక స్థాయి విద్య బోధన అందించడమే తమ లక్ష్యం

- అంగన్వాడీ ఉపాధ్యాయురాలు శారద



చిన్నారులకు బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్

నవతెలంగాణ-ఎడపల్లి

అంగన్వాడీ కేంద్రలో నమోదైన చిన్నారి బాలబాలికలకు పూర్వ ప్రాథమిక విద్యా స్థాయి బోధన అందించడమే తమ లక్ష్యమని ఎడపల్లి మండలం దుబ్బ తండ అంగన్వాడి ఉపాధ్యాయురాలు శారద అన్నారు. మంగళవారం నవతెలంగాణతో ఆమె మాట్లాడుతూ.. రోజువారీగా 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు అంగన్వాడి కేంద్రాలను క్రమంగా నడిపిస్తున్నట్లు ఆమె తెలిపారు. సుమారు 30 మంది బాలబాలికలు, 11 మంది మహిళ గర్భిణీలు తొమ్మిది మంది బాలింతలు తమ కేంద్రంలో నమోదైనట్లు ఉపాధ్యాయురాలు శారద తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి అంగన్వాడి కేంద్రానికి ఆమెను ఆ శాఖ సంబంధిత ఉన్నతాధికారులు ఇన్చార్జి అంగన్వాడి ఉపాధ్యాయురాలుగా నియమించినట్లు ఆమె వివరించారు.

కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను కలిసిన డీఐఈఓ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఐఈవో

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారిగా రవికుమార్ నియమితులైన తర్వాత మంగళవారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జాయింట్ కలెక్టర్ కిరణ్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్‌తో పాటు నిజామాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌ల సంఘం అధ్యక్షులు చిరంజీవి, ప్రధాన కార్యదర్శి రజియుద్దిన్ అస్లాం, జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షులు నరసయ్య ఉన్నారు.

బుద్ధి మాంద్యం, సరిగా మాట్లాడలేకపోవడమే

ఆటిజం లక్షణం



మాట్లాడుతున్న ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల విశాల్

- ప్రపంచ ఆటిజం అవగాహనా దినోత్సవంలో ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల విశాల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పిల్లల్లో బుద్ధి మాంద్యం పదేపదే మాట్లాడడం సరిగ్గా మాట్లాడ లేకపోవడమే ఆటిజం లక్షణాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల విశాల్ తెలిపారు. నవజాత శిశువు నుంచి ఐదు సంవత్సరాలలోపు గుర్తించి సరైన చికిత్స అందించినట్లయితే వారు ఆటిజం బారిన పడకుండా చూడవచ్చని సూచించారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతినగర్‌లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో స్నేహ సొసైటీ దివ్యాంగుల పాఠశాల, ఇండియన్ సైకియాట్రిస్ట్ అసోసియేషన్, తెలంగాణ మెంటల్ హెల్త్ కమిటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఆటిజం అవగాహనా దినోత్సవాన్ని స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, కార్యదర్శి సిద్దయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సంక్షేమ అధికారిని రసూల్ బి ప్రముఖ, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల విశాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల విశాల్ మాట్లాడుతూ.. నవజాత శిశువు నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లో మాటలు సరిగ్గా రాకపోవడం, బుద్ధి మాంద్యం అలాగే పదేపదే మాట్లాడడం అలాగే విచిత్రంగా ప్రవర్తించడం లాంటి లక్షణాలు ఉండడాన్ని ఆటిజం బారినపడ్డ పిల్లలుగా గుర్తిస్తామన్నారు. అయితే ఈ ఆటిజం బారిన పడడానికి చాలా రకాల కారణాలు ఉంటాయని ఆయన చెప్పారు. మహిళలు గర్భంతో ఉన్న సమయంలో సరైన పోషకాహారం తీసుకోకపోవడం, అలాగే సరైన మందులు వాడకపోవడం, అలాగే శరీరానికి పోషకాహారాలు లేని అనవసర ఆహార పదార్థాలు తీసుకోవడం, అలాగే మత్తు పానీయాలు తీసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలు ఆటిజం బారిన పడతారని చెప్పారు. తల్లిదండ్రులు చిన్నప్పుడే ఈ విషయాన్ని గమనించి వారికి సరైన పోషకాహారం ఇవ్వడం వారిని ప్రోత్సహించే విధంగా వైద్యుల సలహాలతో ముందుకు వెళ్తే.. వారు ఉన్నత స్థాయికి ఎదగలరని తెలిపారు. ఇప్పటికే ఎంతోమంది ఆటిజం బారిన పడిన కూడా ఏదోరంగంలో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందారని ఆయన తెలిపారు.

అనంతరం జిల్లా సంక్షేమ శాఖ అధికారి రసూల్ బి మాట్లాడుతూ.. ఆటిజం బారిన పడ్డ వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలా పిల్లలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి మానసిక వైద్యులు డాక్టర్ ఆకుల విశాల్ విషయాలు క్లుప్తంగా వివరించడం ఎంతో అభినందనీయమన్నారు. త్వరలో ఆటిజం బారిన పడ్డ పిల్లలకు వారి తల్లిదండ్రులకు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ఆటిజం పట్ల అవగాహన కల్పించేందుకు సహకారం అందించాలని వైద్యులు డాక్టర్ విశాల్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, స్నేహ సొసైటీ విద్యార్థులు, ఆటిజం బారిన పడిన పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భారీగా బంగారం, నగదు పట్టివేత



పోలీసులు పట్టుకున్న బంగారం, నగదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా బంగారం, నగదు సోమవారం రాత్రి పట్టుబడింది. ఓ వ్యక్తి నుంచి రూ.34.89లక్షల సొత్తు ఒకటో టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒకటో టౌన్ స్టేషన్ హౌస్ అధికారి విజయ్ బాబు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. నాందేవ్ వాడకు చెందిన యువకుడు గంగాప్రసాద్ నుంచి లెక్కచూపని రూ.6.89 లక్షల నగదు, 400 గ్రాముల బంగారం సీజ్ చేశారు. అయితే ఇటీవల ఇదే స్టేషన్ పరిధిలోని కుమార్ గల్లీలో కూడా నగదు పట్టుబడింది. జిల్లా కేంద్రం నుంచి నగదు లావాదేవీలు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు కొత్త ఎత్తుగడ వేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పటిష్టమైన పోలీసు నిఘా బందోబస్తు ఉండే జిల్లా కేంద్రంలో వరుసగా నగదు పట్టుబడటం చూస్తుంటే పోలీస్ నిఘా వైఫల్యమా లేక ఇతర ఏ కారణాలైన ఉన్నాయోనని అనుమానాలు తలెత్తుతున్నాయి. జిల్లా కేంద్రంలోని పరిస్థితి ఇలా ఉంటే మారుమూల గ్రామాల ప్రాంతాల్లో విచ్చలవిడిగా డబ్బు పంపిణీ జరుగుతుందనే చర్చ ముందు కొస్తుంది. పోలీసులకు పట్టుబడిన నగదు, బంగారాన్ని ఎన్నికల అధికారులకు అప్పగించారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో ఈ స్థాయిలో నగదు పట్టుబడటం ఇదే మొదటిసారి అని పోలీసులు, అలాగే ఎన్నికల అధికారులు భావిస్తు న్నారు. అయితే ఈ విషయంలో పలు అను మానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో నిజామా బాద్ పోలీస్ కమిషనర్ సీరి యస్‌గా తీసుకొని విచారణ చేపడుతు న్నట్లు తెలిసింది.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

- రైతుల విజ్ఞప్తి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పహాడ్ గ్రామంలో ఎడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు యువకులు సోమవారం తహసీల్దార్ కార్యదర్శి సిబ్బందికి వినతిపత్రాన్ని సమర్పించారు. మంగళ్‌పాడ్ గ్రామంలో ఐకెపి ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఆ గ్రామ రెవెన్యూ పరిధిలో గల రైతుల వద్ద మాత్రమే కొనుగోలు చేస్తామని ఐకెపి అధికారులు గతంలో తెలిపారని, కొంతమంది రైతులకు ఎడపల్లి రెవెన్యూ శివారులో పంట పొలాలు ఉన్నాయని, మరికొంతమందికి కుర్నాపల్లి రెవెన్యూ శివార్లో పంట పొలాలు ఉన్నాయని, కాగా ఐకెపి ద్వారా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులందరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మంగళ్‌పహాడ్ తాజా మాజీ ఉపసర్పంచ్ కుంట శ్రీనివాస్, గాండ్ల శంకర్, నాయకులు రైతులు చేపూరి శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులున్నారు.

అవకాశమివ్వండి.. ప్రశ్నించే గొంతునవుతా

- బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి

నవతెలంగాణ-మోపాల్

ఒక్కసారి అవకాశమివ్వండి.. ప్రశ్నించే గొంతునవుతానని బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మంగళవారం మండలంలోని నర్సింగ్‌పల్లి శివారులో గల ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఈ ఎంపీని కూడా తమ గ్రామాలలోకి రానీయకుండా ఉండలేరని, కానీ మన నిజామాబాద్ జిల్లా ఎంపీని మాత్రం తమ గ్రామాల్లోనికి రానీయకుండా ప్రజలు తరిమికొట్టారని అటువంటి దౌర్భాగ్యుడు అరవింద్ అని అన్నారు. ఎంతసేపు అబద్ధాలు వాగడం తప్పా నిజామాబాద్ ప్రజలకు చేసిందేమీ లేదని తెలిపారు. పసుపు బోర్డు తెస్తానని రెండుసార్లు జిల్లా ప్రజలను మోసం చేశాడని గత ఎన్నికల్లో బాండ్ పేపర్ రాసిచ్చాడని, ఈసారి ఎన్నికల్లో దేశ ప్రధానితో నోటిమాట చెప్పించాడే తప్పా ఎక్కడా కూడా భూమి చూడలేదని కనీసం పసుపు బోర్డు ఏర్పాటుకు ఒక కమిటీ వేయలేదని అన్నారు. ఈ రాష్ట్రానికి మరొక దౌర్భాగ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నాడని కేవలం నోటిమాటలు, బిఆర్ఎస్ పార్టీని విమర్శించడం తప్ప ప్రజాపాలన చేత కాదని అన్నారు. ఎంతసేపు కేసీఆర్ కుటుంబంపైన ఆడిపోసుకోవడం తప్ప ఆయన చేసిందేమీ లేదని, తెలంగాణకు మరో ఏక్ నాథ్ షిండేగా తయారయ్యాడని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు నిలబడదని, రేవంత్‌రెడ్డి కొందరి ఎమ్మెల్యేలను తీసుకువెళ్లి బిజెపిలో చేరుతాడని ఆయన తెలిపాడు. గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటు బ్యాంకు మొత్తం అరవింద్‌కు బదిలీ కావడం వల్లనే గెలిచాడు తప్ప నిజమైన గెలుపు కవితమ్మదేనని అన్నారు. ఈసారి కూడా కాంగ్రెస్ ఓటు బ్యాంకు మొత్తం బిజెపికి బదిలీ చేసేలా లోపాయికార ఒప్పందం పెట్టుకున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలలో ఎలాగో ఓడించారని, ఈసారైనా తనను గెలిపించాలని పార్లమెంట్ సెషన్‌లో ఢిల్లీలో ఉంటానని తర్వాత ప్రతి గల్లీ గల్లీ తిరుగుతానని, ప్రజల సమస్యలపై పోరాడుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువ నాయకుడు ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్, జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, మాజీ ఎమ్మెల్సీ విజీగౌడ్, మోపాల్ జెడ్పిటిసి కమల నరేష్, మండలాధ్యక్షుడు మోచ్చ శ్రీనివాస్, న్యాల్కల్ శ్రీనివాసరావు, కెసిఆర్ సేవాదల్ అధ్యక్షుడు కొర్వ దేవేందర్, మాజీ సర్పంచ్లు ఇందూరు సిద్ధార్థ, ముత్యంరెడ్డి, సాయిరెడ్డి, కోల గంగాధర్, మాజీ చైర్మన్ ఉమాపతి రావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మూడు రోజుల్లో జైలు శిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా మద్యం సేవించి వాహనం నడిపిన యువకుడికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అర్సపల్లికి చెందిన దమ్ము నవీన్ నిజామాబాద్ అనే వ్యక్తి మందు తాగి బైక్ నడిపిన కేసులో కోర్టు ముందు హాజరుపరచగా రెండవ శ్రేణి న్యాయమూర్తి మూడు రోజుల జైలు శిక్ష విధించారని ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ విజయ్ బాబు తెలియజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి సంతోష్ కుమార్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం సొసైటీలలో రైతుల సౌకర్యార్థం పౌర సరఫరాల శాఖ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బోధన్ మండల వ్యవసాయ అధికారి, ఇన్చార్జి ఏడీఏ సంతోష్ కుమార్, పౌరసరఫరాల శాఖ క్లస్టర్ ఆఫీసర్ రవీందర్ అన్నారు. మంగళవారం సాలూర సొసైటీ ఆవరణలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన వరి పంటకు ప్రభుత్వం కనీస మద్దతు ధర చెల్లిస్తుందని అన్నారు. కావున రైతులు దళారులను ఆశ్రయించి ధాన్యాన్ని విక్రయించి నష్టపోవద్దని సూచించారు. రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వ మద్దతు ధరలు పొందాలని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, కామన్ రకం ధాన్యానికి రూ.2183 ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ బసవంతరావు, రైతులు సందీప్‌రెడ్డి, సంగెపు భూమయ్య, హెుట్లప్పా, గ్రామపెద్దలు, రైతులు, సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

- ఫైర్ అధికారి జే మధుసూదన్‌రెడ్డి



నవతెలంగాణ-ఆర్మూర్

వేసవిలో అగ్ని ప్రమాదాల నివారణకై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ అగ్నిమాపక కేంద్ర అధికారి జే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. షాపింగ్‌మాల్ దుకాణాలు బంద్ చేసేటప్పుడు ఇంవేటర్స్, మెయిన్ స్విచ్‌లు ఆఫ్ చేసుకోవాలని, ఇండ్లల్లో ఏసీ కూలర్లు ఆఫ్ చేసి ఉంచుకోవాలని, షార్ట్ సర్క్యూట్ జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, గ్యాస్ సిలిండర్ ఆఫ్ చేసుకుని వెంటిలేషన్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. బహుళ అంతస్తులలో, అపార్ట్మెంట్లలో షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు లిఫ్ట్ ఉపయోగించకుండా మెట్ల మార్గాన రావాలని సూచించారు. అపార్ట్మెంట్‌లో జిప్లస్ 4ఫైర్ సేఫ్టీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చిన్నపిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు ఇవ్వవద్దని, వేసవిలో సరదా కోసం ఈత కొట్టేందుకు గ్రామాల్లోని చెరువులకు వెళ్తే.. పెద్దలు కనిపెడుతూ ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పొలాలను తగలబెడుతూ పర్యావరణ పరిరక్షణ దెబ్బతీయడమే కాకుండా అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయని, పశు గ్రాసంగా ఉపయోగించే గడ్డిని తగలబెట్టకుండా దున్ని ఎరువుగా ఉపయోగించటం మేలని, ఇండ్లలో సైతం అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

నీలాలో కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా ఐకెపి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ఐకెపి ఎపిఎం చిన్నయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రత్యేక అధికారి ముని నాయక్, సీసీ రాజయ్య ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్, డిఆర్‌డిఎ పిడి ఆదేశాల మేరకు మండలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి మాధవి, గ్రామ సంఘం అధ్యక్షురాలు నిర్మల, సీసీలు రాజయ్య, కృష్ణ, సునీత, రైతులు ఎమ్మెల్యే రాజు, కారోబార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ఆర్మూర్

బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బుస్సాపూర్ శంకర్ పట్టణం నుంచి నిజామాబాద్ నగరానికి వస్తున్న సందర్భంగా ఆర్‌బీ వీఆర్ఆర్ స్కూల్ వద్ద మంగళవారం వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. తన వాహనాన్ని తనిఖీ చేసిన ఎన్నికల సిబ్బందికి పూర్తిగా సహకరించినట్టు తెలిపారు

రెండు లక్షల నగదు సీజ్


తనిఖీలు చేపడుతున్న పోలీసులు

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజంసాగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామం వద్ద ఏర్పాటుచేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు చేయగా కడప జిల్లా అయినటువంటి భూమిరెడ్డి తన కారులో 2,00,000 లక్షల రూపాయలు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్టు ఎస్సై సుధాకర్ తెలిపారు. అట్టి నగదు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో నగదును సీజ్ చేసినట్టు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో సరైన పత్రాలు లేకుండా పెద్ద మొత్తంలో నగదును ఎవరు కూడా తీసుకెళ్లద్దని ఆయన సూచించారు.

రేణుక ఎల్లమ్మకు బోనాల ఊరేగింపు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో మంగళవారం గౌడ కులస్తుల ఆరాధ దైవమైన రేణుక ఎల్లమ్మ బోనాల ఊరేగింపు అంగ రంగ వైభవంగా జరిగింది. సోమవారం రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. మంగళవారం గౌడ కులస్తులు ఇంటింటికి బోనాలను అలంకరించి గ్రామంలోని ప్రధాన నిధుల గుండా డప్పులు, పోతరాజుల విన్యాసం శివసత్తులు పూనకాలతో ఊరేగింపు కొనసాగింది. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, కుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వరికి రూ.500 బోనస్ ఇవ్వాలి

- హామీలు ఇచ్చి రైతులను మోసం చేయడం తగదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకుల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ బృందం

నవతెలంగాణ-కామారెడ్డి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమల్లో భాగంగా రైతులకు వరి పంట కొనుగోలుపై క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ పిలుపు మేరకు మంగళవారం పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతుల బృందం కామారెడ్డిలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. 'అధికారంలోకి వచ్చిన తరువాత 100 రోజుల్లో వరి ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర కంటే అదనంగా రూ. 500 ఇస్తామని కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలలో ఇది కూడా ఒకటి. కాంగ్రెస్ పార్టీ అలివికాని హామీలను ఇచ్చింది. రైతులను, పేదలను మోసం చేయడం సరికాదు. వానాకాలం పంట పోయింది. అయినా ఎక్కడా బోనస్ ఇవ్వలేదు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీనే అడుగుతున్నాం. యాసంగి ధాన్యం కొనుగోలు కోసం నిన్నటి నుండి ప్రభుత్వ మద్దతు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కాబట్టి కొనుగోలు చేస్తున్న ధాన్యానికి బోనస్ రూ. 500 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం. ఒకవేళ మీరు బోనస్ చెల్లించకపోతే రైతులకు మద్దతుగా ఏప్రిల్ 6న ప్రతి నియోజకవర్గ కేంద్రంలో దీక్ష చేస్తాం. ప్రభుత్వం అప్పటికే దిగి రాకపోతే కొనుగోలు కేంద్రాల వద్ద నిరసనలు, ధర్నాలు చేస్తాం. అదేవిధంగా అకాల వర్షాలు, నీళ్ళు లేక ఎండిపోయి నష్టపోయిన రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని' డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నష్టపోయిన రైతులను ఇన్ పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నట్టు గుర్తు చేశారు. 'డిసెంబర్ 9న అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించారు. ఇప్పుడేమో ఎన్నికల కోడ్ అంటున్నారు. మీరు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోండి. ఇవన్నీ ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఆడిన నాటకాలు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా స్పందించాలి. రైతులకు మేలు చేసిన పార్టీ బీఆర్ఎస్. రైతు బంధు, బీమా అమలు చేశాం. 24 గంటల కరంటు అందించాం. మేము ఎప్పుడు రైతులకు అండగా ఉంటాం. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని' స్పష్టంచేశారు. కార్యక్రమంలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ మాజీ శాసనసభ్యులు గంప గోవర్ధన్, జాజుల సురేందర్, హన్మంత్ షిండే, పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు డి అంజిరెడ్డి, బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా జడ్పీటీసీ కుమారుడి వివాహం


వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని సోమారం తాండ లో గాంధారి జడ్పీటీసీ కేతావత్ శంకర్ నాయక్ కుమారుడు కేతావత్ హరీష్ నాయక్ వివాహావేడుకలు మంగళశారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు హాజరై.. వధూవరులను ఆశీర్వదించారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ దంపతులు హాజరైయ్యారు. వారి వెంట ఎంపీపీ రాధాబలరాం నాయక్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ నాయక్, వైస్ ఎంపీపీ భజన్ లాల్, తాజా మాజీ సర్పంచ్ రవీందర్, తాజా మాజీ ఉపసర్పంచ్ కొమ్ముల రమేష్, బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు జింగురు సురేష్ , యువ నాయకులు పరుశరామ్, ప్రేమ్ దాస్, మెగావత్ పండిత్, బానోత్ రాజేష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సెల్ ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండలంలోని తుంకి పల్లి గ్రామవాసి అయిన కురుమ రాముల అనే వ్యక్తి బాన్సువాడ నుండి తుంకి పల్లి వెళ్లే క్రమంలో తన సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఫిర్యాదు చేయగా.. ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి బాధితుడికి అప్పగించినట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. దీంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార సదస్సు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార సదస్సును ఏర్పాటు చేయనున్నట్టు ట్రాన్స్‌కో డిఈ గణేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యలు ఉన్నట్లయితే సమావేశం దృష్టికి తీసుకురావాలని, సకాలంలోనే పరిష్కరించనున్నట్టు తెలిపారు.

విద్యుత్ వినియోగించే రైతుల సమస్యలు ఉన్నట్లయితే సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరిష్కార వేదికలో గృహవినియో దారులు వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు తదితర సమస్యలు ఉన్నవారు దరఖాస్తు చేసుకున్నట్లయితే వాటిని దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించనున్నట్టు తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విద్యుత్ వినియోగదారులకు సూచించారు. ఈ పరిష్కార సదస్సులు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని ఏఈలు సదస్సులో పాల్గొననున్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కార సదస్సు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ముగ్గురు ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు

- ఉపాధి పని కల్పించడంలో నిర్లక్ష్యం వహించినట్టు కలెక్టర్ సీరియస్
- కూలీల సంఖ్య పెంచాలని సూచన



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించకుండా పనులు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ముగ్గురు ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం ఉపాధి హామీ పనులకు కూలీల సంఖ్య పెంపు , అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, తాగునీటి ఎద్దడి, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటా డుతూ ఉపాధి హామీ పనులకు కూలీలు తక్కువ సంఖ్యలో వస్తున్న గాంధారి, నసురుల్లాబాద్, బిచ్కుంద మండలాల ఎంపీడీవోలు రాజేశ్వర్, గోపాల్, నీలావతికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని తెలిపారు. గ్రామస్థాయిలో కూలీలకు అధికారులు అవగాహన కల్పించి పనులకు ఎక్కువ సంఖ్యలో కూలీలు వచ్చే విధంగా చూడాలన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో తాగునీటి వసతి, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్లు, వాష్ బేషన్స్ సక్రమంగా ఉండే విధంగా చూడాలని చెప్పారు. తరగతి గదుల మైనర్ మరమత్తులు చేయాలని చెప్పారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతి మండలంలో పనుల పర్యవేక్షణకు ఇంజనీరింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పాఠశాలలను తనిఖీ చేసి పక్కాగా ప్రతిపాదనలు రూపొందించాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనా కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూన్ 5 లోగా పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తుగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కోరారు. ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. తాగునీరు గ్రామాల్లో వృధా కాకుండా చూడాలన్నారు. తాగునీటిని వృధా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సరఫరాను పర్యవేక్షించేందుకు మండల స్థాయిలో, గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానికంగా ఉన్న వ్యవసాయ మోటార్లను అద్దెకు తీసుకొని వినియోగించుకోవాలని కోరారు. రానున్న రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను వెంటనే గుర్తించి వాటిని సత్వరమే పరిష్కారం అయ్యే విధంగా చూడాలని పేర్కొన్నారు. 60 ఏండ్లు దాటిన వృద్ధులను ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిద్రించకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చూడాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీటి వసతి, నీడ కల్పించాలన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేస్తామని చెప్పారు. ఇతర రాష్ట్రాల ధాన్యం తెలంగాణ రాష్ట్రానికి రాకుండా రెండు చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఆశ, ఆరోగ్య కార్యకర్తలు గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. వారి వద్ద అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉండే విధంగా అధికారులు చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జెడ్పి సీఈవో చందర్ నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు, పంచాయతీ రాజ్ ఈఈ సదాశివరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని నర్సింగ్ రావు పల్లి గ్రామంలో వరి ధాన్య కొనుగోలు కేంద్రం మంగళవారం ప్రారంభించినట్టు సంఘం కార్యదర్శి సంగమేశ్వర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి ధాన్యాన్ని సకాలంలో రైతులు వరి కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ ఆఫీసర్ నాగరాజు, సంఘ సభ్యులు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని చిన్నఎడ్గి గ్రామ పంచాయతీ గ్రామంలో మంగళవారం జాతీయ ఉపాధి హామీ పనులను ఎంపిడీవో శ్రీనివాస్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారని గ్రామ పంచాయతీ కార్యదర్శి షిండే విజయ్‌కుమార్ తెలిపారు. తొలి సారిగా విచ్చేసిన ఎంపిడివోకు శాలువాతో సన్మానించారు. అనంతరం ఉపాదీహమీ పనులు పనులను పరశీలించారు. ఆయన కూలీలతో మాట్లాడాడుతూ.. కొలతల ప్రకారం పని చేస్తే పూర్తీ స్థాయిలో కూలీ పొందవచ్చని, పని చేయకుండా సమయం వృథా చేయవద్దని కూలీలకు సూచించారు. ఎండ తీవ్రత పెరుగుతున్న దృశ్య ఉదయం పూట త్వరగా వచ్చి పనులు చేయాలని, ఎండలో పని చేయవద్దని కూలీలకు తెలిపారు. ఆయన వెంటా జీపీ కార్యదర్శి షిండే విజయ్, గ్రామస్తులు శివాజీ పటేల్ ఉన్నారు.

బాలుడు అదృశ్యం



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని కల్కినగర్‌కు చెందిన మల్లారెడ్డి అరవింద్ అనే బాలుడు మంగళవారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాళ ప్రకారం ఈ బాలుడు 6 వ తరగతి చదువుతున్నాడని, మంగళవారం మధ్యాహ్నం సుమారు 12:30 గంటల సమయంలో తన తమ్ముడి స్కూల్ నుండి తీసుకొని వస్తాను అని ఇంట్లో చెప్పి వెళ్లి ఇప్పటి వరకూ తిరిగి రాలేదు, కావున ఈ అబ్బాయి ఎవరికి ఐన కనిపించినట్లితే కామారెడ్డి రూరల్ సీఐ, 8712686148, దేవునిపల్లి ఎస్సై 8712686150. ఈ ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళి


లింగంపేట్‌లో నివాళి అర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్/లింగంపేట్

మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలను నిర్వహించి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు కలాలి యాదగిరిగౌడ్, సురేందర్‌గౌడ్, వంశీగౌడ్, సాయగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఇగురం యాదగౌడ్, బాలగౌడ్, మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం ప్రతినిధులు మాట్లా డుతూ.. నిజాంకు వ్యతిరేకంగా పోరాడి బానిస బతుకుల నుంచి విముక్తి చేసినటువంటి మహానీయుడు అన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు రాజాగౌడ్, నారాగౌడ్, మనోహర్ గౌడ్, నారా గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, ప్రసాద్‌గౌడ్, రాముగౌడ్, బుజ్జాగౌడ్, కిష్టగౌడ్, స్వామిగౌడ్, భాస్కర్‌గౌడ్, తొడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న జీపీ కార్యదర్శి

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని అన్నారంలో మంగళవారం నూతన ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనులను పంచాయతీ కార్యదర్శి లింగాల సాగర్, గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. కొలతల ప్రకారము, కూలీలు చెల్లించబడుతాయని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని, ఉదయాన్నే పనికి వెళ్లాలని, తగినన్ని తాగునీరును పని ప్రదేశంలో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-భిక్కనూర్

బాల్య వివాహాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని ఇంచార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాలలో జంగంపల్లి గ్రామపంచాయతీ, పెద్దమల్లారెడ్డి, సిద్ధ రామేశ్వరనగర్, అంతంపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో బాల్య వివాహాలపై గ్రామ పంచాయతీల కార్యదర్శులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే వివాహం చేయాలని 18 సంవత్సరాలలోపు వివాహం నిర్వహిస్తే చట్టరీత్యా నేరమని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

కన్నాపూర్ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జడ్పీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి/సదాశివనగర్

మండలంలోని కన్నాపూర్ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. మదన్‌మోహన్‌రావు మంగళవారం మండలంలోని ఇస్సన్నపల్లి రామారెడ్డి లో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయాన్ని దర్శించుకు న్నారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ పూజారులు శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు, స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

అనంతరం రామారెడ్డి తో పాటు కన్నాపూర్‌లో ఇల్లు దగ్ధమవడం, పలువురు మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శిం చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్ రావు, గిద్ద ఎం పి టి సి ప్రవీణ్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గిరెడ్డి మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మా గౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, నామాల రవీందర్, తూర్పు సుబ్బన్న, తూర్పు రాజు, పరశురాం, బి పేట నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

సదాశివనగర్ : మండలంలోని భూంపల్లి గ్రామంలో రెండు బాధిత కుటుంబాలను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు మంగళవారం పరామర్శించారు. గ్రామానికి విఠల్ గౌడ్ రోడ్డు ప్రమాదంలో మరణించారు. మృతి ని భార్య పిల్లలు పరమర్శించి ఓదార్చారు. మృతుడి అన్న మాజీ సర్పంచ్ రవిందర్ గౌడ్ ని పరమర్శించి ఓదార్చారు. అదే గ్రామానికి చెందిన యల్. గోపవ్వ మంగళవారం మరణించారు. ఆమె కొడుకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు యల్. రాజేశ్వరరావు పరమర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంబడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి సిం గిల్ విండో చైర్మన్ గంగాధర్, సురెందర్ నాయక్, లక్ష్మీ పతి శ్రీనివాస్‌గౌడ్, కాశీరాం, నర్సింలు, గద్దల రాములు , నవీన్ కె.దత్తురావు తదితరులు ఉన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

వెన్నుపూస నొప్పి భరించలేక ఉరేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగిరెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మంగలి యాదమ్మ (54) గత కొంతకాలంగా వెన్నుపూస నొప్పి తో బాధపడుతుంది. నొప్పి తీవ్రం కావడంతో భరించలేక మంగళవారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజు తెలిపారు. కొడుకు మంగలి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునికి సన్మానం


శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-నాగిరెడ్డిపెట్

కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన పోచారం గ్రామానికి చెందిన ఆకిరెడ్డి గారి శ్రీనివాస్ రెడ్డిని మంగళవారం పలువురు గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో యాదగిరిగౌడ్, కిరణ్, బేస్త గంగారం, మంగలి రాజు, తదితరులు ఉన్నారు.

మోహన్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అమీర్‌నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని మంగళవారం కలిశారు. ఇటీవల రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమితులైనందుకు హర్షం వ్యక్తం చేస్తూ మానాల మోహన్‌రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రాజుల రమేష్, మండల కార్యదర్శి నర్సయ్య, నాయకులు లింబాద్రి, లక్ష్మి నర్సయ్య, రాజేశ్వర్, చిన్ననర్సయ్య, భూమయ్య, పెద్ద నర్సయ్య తదితరులున్నారు.

గ్రామాలను సందర్శించిన ఎంపీడీవో



నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్ బడా భీంగల్ పెద్దమ్మకాడి తండా, సికింద్రాపూర్ గ్రామాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాలలో సానిటేషన్, నీటి సమస్యల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. నీటి ట్యాంకులను సందర్శించి వాటిని పరిశీలించారు. బడా భీంగల్ గ్రామంలో డ్రైనేజీ పనులను తనిఖీ చేశారు. పెద్దమ్మకాడి తండా నర్సరీని సందర్శించి పలు సూచనలు జారీ చేశారు. నీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. సికింద్రాపూర్ గ్రామంలో సానిటేషన్, నీటి సమస్యలపై పంచాయతీ కార్యదర్శితో సమీక్ష చేశారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ జి.నర్సయ్య, టెక్నికల్ అసిస్టెంట్‌లు, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

రైతులను రోడ్డుకీడ్చిన బీజేపీ

- ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఏమాయే?
- ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసింది
- రెండు పర్యాయాలు అధికారంలో ఉండి చేసిందేమీ లేదు
- వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించండి
- నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎన్నికల హామీలు నెరవేర్చలేని బీజేపీ ప్రభుత్వం ఎందుకు అధికారంలో ఉందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దనోట్ల రద్దుతో అవినీతిని నిర్మూలించలేదన్నారు. బిజెపి రైతాంగాన్ని ప్రోత్సహించాల్సింది పోయి రైతులను దేశ రాజధానిలో రోడ్డున పడేసిందన్నారు. మద్దతు ధర కల్పించడం ప్రభుత్వం బాధ్యత.. దానికి చట్టబద్ధత కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యత అన్నారు. రైతులకు రుణాలు మాఫీ చేస్తే సోమరిపోతులు అవుతారని అంటున్న మోడీ ప్రభుత్వం బడా వ్యాపారులకు ఎందుకు రుణాలు మాఫీ చేసిందని ప్రశ్నించారు. గతంలో యూపీఏ ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ చేసిందని, ప్రస్తుతం వ్యవసాయ కూలీలకు పని కల్పించేవిధంగా, ఉపాధి హామీ పనిని వ్యవసాయానికి అనుసంధానం చేసే విధంగా కాంగ్రెస్ పార్టీ ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. కేంద్రంలో అధికారంలోకి రాగానే దేశం మొత్తం రైతు రుణాలు మాఫీ చేసే విధంగా కాంగ్రెస్ పార్టీ ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. 2014లో అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ 105 డాలర్లు ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం పెట్రోల్‌ను రూ.60కు ఇచ్చిందని తెలిపారు. ఇప్పుడు అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ 75 డాలర్లకు పడిపోయినా.. బిజెపి ప్రభుత్వం పెట్రోల్‌ను రూ.110 పెంచిందని తద్వారా నిత్యావసర వస్తువుల ధర పెరిగిందని ఆయన అన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసిందని, ఎలెక్టోరల్ బాండ్ పేరుతో వేల కోట్ల అవినీతికి పాల్పడిందని విమర్శించారు. జాతీయ స్థాయిలో మార్పు రావాలని రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం దేశాన్ని ప్రైవేట్ పరం చేసిందని, రైల్వేలు, రోడ్లు ప్రైవేటీకరణ చేసిందని ఆయన విరుచుకుపడ్డారు. అరవింద్ పసుపు బోర్డుకు బాండ్ పేపర్ రాసి మోసం చేశాడని, నరేంద్ర మోడీ పసుపు బోర్డుకు జీవో ఇచ్చి అరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో విధి విధానాలు తెలియజేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీడీలు చేసే ఆడబిడ్డలకు 2014 కట్ ఆఫ్ డేట్ పెట్టి పింఛన్ ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి కట్ ఆఫ్ డేట్ లేకుండా ప్రతి ఒక్క బీడీలు చేసే ఆడబిడ్డలకు పింఛన్ అందిస్తుందని ఆయన తెలిపారు. కరీంనగర్ స్మార్ట్ సిటీగా గుర్తింపు పొందిన విధంగా నిజామాబాద్ కూడా స్మార్ట్ సిటీగా గుర్తింపు పొందే విధంగా ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్తామని, విద్య, వైద్య ఉపాధి పరంగా మెరుగైన వసతులు కల్పించేందుకు కృషిచేస్తానని ఆయన తెలిపారు. సమావేశంలో రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ చైర్మన్, కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ నగర అధ్యక్షులు కేశ వేణు, పిసిసి ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు వేణురాజ్, రత్నాకర్, అంతిరెడ్డీ రాజారెడ్డి, అవెజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం



మాట్లాడుతున్న సొసైటీ సీఈవో

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రైతులు పండించిన ప్రతి వరి గింజనూ కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళనకు గురికావొద్దని రాంపూర్ సహకార సొసైటీ సీఈఓ నాగరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని సుద్దపల్లిలో ఐడిసిఎంఎస్ ఆధ్వర్యంలో నెలకొల్పిన రాంపూర్ సహకార సొసైటీ పరిధిలోని ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం వరి ధాన్యాన్ని ఎగ్రేడ్‌కు రూ.2203, బీ గ్రేడ్ కామన్‌కు రూ.2183 మద్దతు ధర ప్రకటించిందని దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బోక్క గంగాధర్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గోపు గోవర్ధన్, గౌరవ అధ్యక్షులు దర్మపు గంగాధర్, సొసైటీ సిబ్బంది నాగేశ్వరరావు, కుమ్మరి శ్రీనివాస్, మోహన్, గోపు గోపాల్, మహేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక



కాంగ్రెస్‌లోకి చేరుతున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సమక్షంలో మండలంలోని రాంపూర్.డి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి లచ్చుమోల్లా దత్త్రాద్రి, సక్కర్ల రాజన్న, నర్సగౌడ్, సందీప్, రజనీకాంత్, విజయ్, సహకార సొసైటీ చైర్మన్ తారాచంద్ నాయక్ ఆధ్వర్యంలో బిజెపి, బిఆర్ఎస్ నుంచి దాదాపు, రెండు వందల మంది కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. చేరిన వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాంపూర్.డి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్, లింగుల లింగం, బక్కన్న, విడిసి సభ్యులు, సొసైటి డైరెక్టర్లు, బిజెపి, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు చేరడం అభినందనీయమన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని వారందరికీ సూచించారు. గ్రామంలో ఎలాంటి అభివృద్ధి కావాలన్న తనవంతు పాటు పడతానని, అనునిత్యం వందలాది మంది ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి లచ్చుమోల్లా దత్త్రాద్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీలను ఆరునూరైన అమలు చేస్తుందని, ఇచ్చిన మాట ప్రకారం పలు హామీలను అమలు చేస్తుందని వివరించారు. ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని, తామందరం ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ చిన్నిలింగుల చిన్నయ్య, మాజీ సర్పంచ్ అశాన్న, ఎంపిటిసి భర్త పోతర్ల రవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అమృతపూర్ గంగాధర్, బిసి, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జీవితంలో శారీరక మానసికోల్లాసానికి క్రీడలు ప్రధానమైనవని, జీవితంలో, క్రీడల్లో గెలుపోటములు సహజమేనని అసోసియేట్ ప్రొఫెసర్ పున్నయ్య అన్నారు. ఎన్ఎస్‌యుఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని యూనివర్సిటీలో క్రీడా పోటీలను నిర్వహించారు. యూనివర్సిటీ గ్రౌండ్‌లో నిర్వహించిన కబడ్డీ ఫైనల్ మ్యాచ్ ప్రారంభించడానికి అప్లైడ్ ఎకనామిక్స్ హెచ్ఓడి, అసోసియేట్ ప్రొఫెసర్ పున్నయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో గత వారం రోజుల నుంచి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-ధర్పల్లి

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఎంపిడిఓ బాలకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని కొటాలపల్లి, సీతాయిపేట్ గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి కూలీల సౌకర్యాల ఏర్పాటుపై ఎంపిడిఓ బాలకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా అయన ఆయా గ్రామాల్లో పనులు చేస్తున్న కూలీలకు తాగునీరు, టెంట్ సౌకర్యాలు ఎలా ఉన్నాయో కూలీలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కూలీల హాజరు నమోదును పరిశీలించారు. వేసవి దృష్ట్యా కులీలకు ప్రభుత్వం కూలీ పెంచినందున అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఓ వినోద, తదితరులున్నారు.

విప్లవ వీరుడు.. సర్వాయి పాపన్న

- తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నివాళి



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారులు పెద్ది వెంకట్రాములు అన్నారు. మంగళవారం తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినాయకనగర్‌లో గల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత దురహంకారులైన కుతుబ్ షాహిలను, మొగల్ చక్రవర్తులను ఎదిరించిన తొలి తెలుగు జాతీయ విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. 17వ శతాబ్దంలోనే అగ్రకుల, అగ్రవర్ణాల మతోన్మాదుల ఆధిపత్య దోపిడీ పీడనలను బహుజనులను కలుపుకొని ఎదిరించిన శూరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కొనియాడారు. రాజులకు, చక్రవర్తులకు ధీటుగా.. సామాన్యుడు తలుచుకుంటే రాజ్యాధికారం చేపట్టగలడనే విశ్వాసాన్ని మూడున్నర శతాబ్దాల పూర్వమే నిరూపించిన సాహస వీరుడు పాపన్న గౌడ్ అని గుర్తుచేశారు. ప్రస్తుతం దేశంలో ఏలుబడిలో ఉన్న మతోన్మాద ఫాసిస్టులను వ్యతిరేకించకపోతే దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకని సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తిని ఆయన ఆశయాలను తీసుకొని, బహుజనులందరినీ ఐక్యం చేసి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నయవంచక పాలకులను తరిమికొట్టాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని పిలుపునిచ్చారు. నయవంచక పాలకులను తరిమికొట్టే అవకాశం పార్లమెంట్ ఎన్నికల రూపంలో మన ముందుకు వచ్చిందని, దీన్ని ఉపయోగించుకోవాలని గౌడగీత కార్మిక సోదరులు, బహుజనులందరికి పిలుపునిచ్చారు. ఎందరికో ఈ ప్రభుత్వం అధికారికంగా జయంతులు, వర్ధంతీలు జరుపుతుందని, మూడున్నర శతాబ్దాల కిందనే మొగల్ మతోన్మాద చక్రవర్తులను ఓడించి గోల్కొండ సింహాసనంగా పరిపాలించిన ఘనత కలిగిన సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తిని తీసుకొని, ప్రభుత్వం ఆయన జయంతిని, వర్ధంతిని అధికారకంగా జరపాలని కోరారు. ఆయన వర్ధంతి రోజు సెలవు దినంగా ప్రకటించి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కోయెడి నర్సింహులు, పెద్దిసూరి, శ్రీరామ్, కోయడి కిషన్, శేఖర్, శంకర్, హైమద్, భీమాశంకర్‌లు పాల్గొన్నారు.

దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించొద్దు

- అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-నవీపేట్

ధాన్యం కొనుగోలు విషయంలో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించవద్దని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని జన్నేపల్లి గ్రామంలో బినోల సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు విషయంలో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలో 11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ఆరులక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. జిల్లాలో 466 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నామని సోమవారం వరకు 140 కేంద్రాలను ప్రారంభించామని అన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధరను పొందాలని ఈ సందర్భంగా సూచించారు. అనంతరం నాలేశ్వర్, బినొల, నిజాంపూర్, మోకన్‌పల్లి, మహంతం తదితర గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను సొసైటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిఏఓ పాపయ్య, క్లస్టర్ అధికారి జియావుద్దీన్, చైర్మన్ మగ్గరి హనుమాన్లు, మాజీ సర్పంచ్ సరీన్, కార్యదర్శి రమేష్, రైతులు సంజీవరావు, విడిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ దొంగల హల్‌చల్

- ఆలయాల్లో చోరీలపై నజర్
- శివారు ప్రాంతాల్లో ఉన్న ఆలయాలే లక్ష్యంగా దాడులు చేస్తూ హుండీ చోరీ



నవతెలంగాణ-ఏర్గట్ల

దోపిడీ దొంగల చెలరేగిపోతున్నారు. శివారు ప్రాంతాల్లోని ఆలయాలే దోపిడీలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా జనసంచారం లేని ఆలయాలను అదునుగా చేసుకుని హుండీలను పగులగొడుతూ అందినకాడికి దండుకుంటున్నారు. ఏది దొరకకపోతే ఆఖరికి గుడిలో గంటలను, ఇత్తడి సామగ్రిని సైతం దొంగతనం చేసి తమచేతి వాటం ప్రదర్శిస్తున్నారు.

వివరాల్లోకి వెళితే.. ఆరు నెలల క్రితం మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో హుండీని పగల గొట్టి ఏమి దొరకక పోవడంతో అక్కడ ఉన్న 15 వేలు విలువ చేసే ఇత్తడి సామగ్రిని, సిలిండర్ బండను ఎత్తుకెళ్ళారు. పక్కనే ఉన్న మల్లన్న స్వామి ఆలయంలో హుండీలను పగలగొట్టి అందులో డబ్బులు లభించకపోవడంతో హుండీలను అక్కడే పడవేసి వెనుదిరిగారు. తాజాగా సోమవారం రాత్రి మండల కేంద్రంలోని శివాలయంలో ఆలయ హుండీని పగలగొట్టి అందులో డబ్బులేమి లభించకపోవడంతో హుండీని గుడిబయట విసిరివేసి వెళ్ళిపోయారు. గత నెల రోజుల క్రితం ఇదే ఆలయంలో గుడి గంటలు సైతం దొంగిలించబడ్డాయి. తాజాగా ఏర్గట్ల పక్క మండలంలోని ఉప్లూర్ గ్రామంలో సోమవారం రాత్రి అయ్యప్పస్వామి ఆలయంలో దొంగతనం చేసి 6 వేల రూపాయలను, నెల కిందట సాయిబాబా ఆలయ హుండీని ధ్వంసం చేసి 9 వేల రూపాయల వరకు దొంగతనం చేసినట్లు స్థానికులు తెలిపారు. ఇటు ఆదివారం రాత్రి ఏర్గట్ల ప్రక్క గ్రామం మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో దొంగలు తెగబడ్డారు. గ్రామం నడి బొడ్డున గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో, ఊరు చివరన గల పెద్దమ్మ గుడిలో కలిపి 13 వేల రూపాయల వరకు దొంగతనం చేసినట్లు స్థానికుల సమాచారంతో తెలిసింది.

అయితే ఇప్పటి వరకు చోరీలకు పాల్పడ్డ నిందితులను పట్టుకోకపోవడం గమనార్హం. ఆర్మూర్ డివిజన్‌లో తాళం వేసి ఇండ్లు, ఆలయాలే లక్ష్యంగా కొన్ని నెలలుగా దొంగలు హల్‌చల్ సృష్టిస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. పోలీస్ అధికారులు స్పందించి విచారణ ముమ్మరంగా చేపట్టి నిందితులను పట్టుకోవాలని డివిజన్ వాసులు కోరుతున్నారు. అదే విధంగా రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేసి చోరీలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

కారంపొడి కోసం వెళ్లి.. మహిళ మృతి

- అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు



సులోచన (ఫైల్)

నవతెలంగాణ-నవీపేట్

కారంపొడి తీసుకువచ్చేందుకు కారులో ధర్మాబాద్ వెళ్లి తిరిగి వస్తుండగా మండలంలోని జగ్గారావు ఫారం వద్ద కారు చెట్టును ఢీకొనడంతో మహిళా సులోచన(52) మృతి చెందినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ పట్టణంలోని కోటగల్లికి చెందిన సులోచన భర్త సుదర్శన్‌తో పాటు మరో ముగ్గురు అనిత, సునీత, కవిత కారంపొడి తీసుకువచ్చేందుకు ఉదయం మహారాష్ట్ర ధర్మాబాద్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా అతివేగం కారణంగా అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో సులోచన అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కుమారుడు మనిష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని మహిళ శవం లభ్యం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఘన్పూర్ గ్రామంలోని పెద్ద చెరువులో గుర్తుతెలియని మహిళ శవం లభ్యమైనట్లు ఎస్సై మహేష్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 42-45 సంవత్సరాల వయస్సున్న గుర్తుతెలియని మహిళ ఘన్పూర్ గ్రామ సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఘనపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్ ఫిర్యాదు మేరకు చెరువుకి వెళ్లి పరిశీలించగా ఒక గుర్తుతెలియని మహిళ శవం పైకి తేలడంతో సఫాయి కార్మికులు నవీన్, రమేష్‌తో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలి ఒంటిపై దుప్పటి, చీర ఉన్నాయి. ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని మార్చురీకి తరలించారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తన పరువు పోయిందని మనస్తాపంతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మండల కేంద్రంలోని ఘన్‌పూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాలకు ప్రకారం.. ఘనపూర్ గ్రామానికి చెందిన మచ్చ ప్రవీణ్ కుమార్ (43) అదే గ్రామానికి చెందిన మల్లుబాయి మృతిని ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యుల అందరిముందు బూతు పురాణంతో తిట్టింది. గొడవ పెట్టుకోవడంతో తన పరువు పోయిందని ప్రవీణ్‌కుమార్ మనస్థాపానికి గురై అర్ధరాత్రి సమయంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గల చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. మృతిని భార్య మచ్చ శివరాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మచ్చ ప్రవీణ్ కుమార్ మృతికి కారణమైన మల్లు బాయిని మంగళవారం అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

పశువులకు గాలికుంటు టీకాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని వెంగల్‌పాడ్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించినట్లు మండల పశువైద్యాధికారి విఎస్ గంగాప్రసాద్ తెలిపారు. గ్రామంలోని దాదాపుగా 800 పశువులకు ఉచిత టీకాలు ఇచ్చినట్లు అయన వివరించారు. ప్రతి రోజూ ముందస్తుగా గ్రామంలో చాటింపు చేయిస్తున్నామని, గ్రామానికి వచ్చే పశువైద్య సిబ్బందికి రైతులు సహకరించాలని డాక్టర్ గంగాప్రసాద్ కోరారు. కార్యక్రమంలో తిరుపతి, రాజు, సుజాత, పోశెట్టి, రైతులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వడదెబ్బ తగలకుండా పలు జాగ్రత్తలు పాటించాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ అన్నారు. మంగళవారం ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో అవగాహన కల్పించారు. ఎక్కడైన ప్రయాణించేటప్పుడు తాగునీరు తమవెంట తీసుకెళ్లాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను వెంట ఉంచుకోవాలని సూచించారు. నిమ్మరసం, మజ్జిగ, పండ్ల రసం లాంటి పానీయాలు ఇంటిలో తయారు చేసుకొని తాగాలన్నారు. పండ్లు, కర్భూజా, ఆరెంజ్, ద్రాక్ష, పైనాపిల్, దోసకాయ లాంటి సీజనల్ పండ్ల రసాలను తీసుకోవాలని పేర్కొన్నారు. వేసవికాలంలో కాటన్ వస్త్రాలను ధరించడం మంచిదని, ఎండలో బయటకు వెళ్లేటప్పుడు బూట్లు లేదా చెప్పులు ధరించాలని, రేడియో, టీవీ చూడడం ద్వారా వార్తలలో అప్రమత్తత ఎండ తీవ్రతను తెలియజేస్తారని వాటిని గమనిస్తూ ఉండాలని వివరించారు. వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఎండ ఉన్న సమయంలో బయటకు వెళ్ళవద్దని సూచించారు. వడదెబ్బపై అవగాహన కల్పిస్తూ ఇంటింటికి తిరిగి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి అక్బర్‌అలీ, ఆశాకార్యకర్త సుభద్ర పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని గుడితండాలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం పరిశీలించారు. అలాగే ముదక్‌పల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లింగంనాయక్ మాట్లాడుతూ.. వేసవికాలం ఉన్నందున ఉపాధి హామీ పనులను గ్రామంలో ఉన్న నిరుపేదలందరికీ కల్పించాలని, ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉపాధి హామీ పనికి వచ్చే వారి కోసం మంచి నీళ్ల సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈసిఏలు, పంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు.



ఉపాధి పనులు పరిశీస్తున్న ఎంపీడీవో

ఘనంగా విగ్రహాలు శోభాయాత్ర

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలో సీతారామాంజనేయ స్వామి ప్రతిష్టాపన మహోత్సవాలు మంగళవారం సైతం రెండవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి ప్రార్థన, శాంతి పాఠము, గణపతి పూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ట, నివేదన నీరజనం, మంత్ర పుష్పం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం విగ్రహాల శోభాయాత్రను గ్రామంలోని ప్రధాన రోడ్డు నుంచి ఆలయం వరకు చేపట్టారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్త, సురేందర్‌రావు, గ్రామ వీడిసి, రామాలయ కమిటీ సభ్యులు, యువకులు, అర్చకులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలి

- వరికి రూ.500 బోనస్ చెల్లించాలి
- కలెక్టర్‌కు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రూ.500 బోనస్ ఇస్తామని హామీనిచ్చిందని, చేతికొచ్చే దశలో పంటలు నష్టపోవడం రైతాంగానికి ఆందోళన కలిగిస్తుందని, వెంటనే గ్రామాల వారిగా పంట నష్టాన్ని అంచనా వేయాలన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అదజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అధికారుల బృందాలను నియమించి యుద్ధ ప్రాతిపదికన నివేదికలు తెప్పించుకోవాలని, నష్ట పరిహార వివరాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పంపి ఎకరాకు రూ.25, 000 నష్టపరిహారం అంది చేలా చూడాలన్నారు. వానాకాలం పోయి యాసంగి వచ్చిన వడ్లకు బోనస్ పై ప్రకటన ఇప్పటివరకు చేయలేదని, ఒకవైపు యాసంగి ధాన్యం కొనుగోలు మొదలైనా.. బోనస్‌పై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయడం లేదన్నారు. ఇప్పటికే సాగునీరు కరువై పంటలు ఎండిపోతుంటే కనీసం బోనస్‌తో అయినా ఊరట లభిస్తుందని రైతులు అనుకుంటే దాన్ని నిరాశగానే మిగిల్చారని తెలిపారు. కొత్తగా ఎన్నికల కోడ్ ఉందని సాకు చూపిస్తున్నారని, అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఊదరగొట్టిన కాంగ్రెస్ పార్టీ తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీపై నోరు మెదపడం లేదని విమర్శించారు. రైతుల పక్షాన ప్రభుత్వంపై యుద్ధం చేయడానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు సిద్ధంగా ఉన్నారని, ఒకవైపు నీరు లేక పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్య చేసుకుంటుంటే కాంగ్రెస్ నాయకులు, అధికారులు చోద్యం చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతూ కిరణ్, జెడ్పి చైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావు, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు, నాయకులు సుజిత్ సింగ్, సత్యప్రకాశ్, సుదాం రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా మొదటి బుధవారం సైబర్ జాగృక్త దివస్

- సైబర్‌స్టేషన్ ప్రారంభించిన పోలీస్ కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రతి నెలా మొదటి బుధవారం సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పోలీస్ కమిషనర్ వెల్లడించారు. మంగళవారం కమిషనరేట్‌లో సైబర్ స్టేసన్‌ను ప్రారంభించారు. సాంకేతిక వినియోగం ఎక్కువ కావడం వల్ల సైబర్ నేరాల సంఖ్య అదే స్థాయిలో పెరిగి పోయిందని, సైబర్ నేరాలకు చెక్ పెట్టడం, ప్రజలకు సమర్థవంతంగా సేవలందించడమే లక్ష్యంగా పనిచేయనున్నట్టు తెలిపారు. లక్షరూపాయలకు మించి జరిగే మోసాలకు నేరుగా సైబర్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, అంతకు తక్కువ డబ్బులతో మోసపోతే స్థానిక పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

సాంకేతిక పద్ధతులకు తగ్గట్టుగా దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ క్రైమ్ యూనిట్ల ఆవశ్యకత చాలా ఉన్నదని, ఇందుకోసమే పోలీస్‌శాఖ ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించి 1930 ద్వారా కూడా సైబర్ క్రైమ్ రిపోర్ట్ చేయవచ్చని, ప్రధానంగా భాదితులు డబ్బులు పోయిన వెంటనే ఫిర్యాదు చేయడానికి ముందుకు రావాలని, మోసపూరిత లావాదేవీలు జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే వాటిని తక్షణం నిలిపి వేసి సంబంధిత వారి ఖాతాను ఫ్రీజు చేసే విధంగా చూడవచ్చని పేర్కొన్నారు. సైబర్ నేరాల కేసుల్లో పూర్తిస్థాయి ఆధారాలను సేకరించి నేరస్తులను గుర్తించనున్నట్టు తెలిపారు. వారికి శిక్ష పడేలా చేయడం తద్వారా భాధితులకు న్యాయం చేయనున్నట్టు వివరించారు.

ఏఐపిఎస్‌యు నుంచి కిరణ్, జ్వాల బహిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఏఐపిఎస్యు రాష్ట్ర కార్యదర్శి కిరణ్‌ను, జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాల ను బహిష్కరిస్తున్నమని రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్‌పి)జిల్లా కార్యదర్శి యార్లగడ్డ సాయిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ సెక్రెటరీ, ఆర్ఎస్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు ఆదేశానుసారం ఏఐపిఎస్యు రాష్ట్ర, జిల్లా బాధ్యతలలో కొనసాగుతున్న కిరణ్, జ్వాలను సంఘం నుంచి బహిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో అనేక సంఘాలలో పనిచేసి వలసగా ఏఐపిఎస్యు సంఘంలోకి వచ్చి విద్యారంగం సమస్యలపైన పనిచేయకుండా, కేవలం వసూలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తూ, ప్రైవేట్ విద్యాసంస్థల యజమాన్యాలను బ్లాక్ మెయిల్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేసి, డబ్బులు వసూలు చేస్తూ ఏఐపిఎస్యు సంఘం ప్రతిష్టను అభాసుపాలు చేస్తున్నారని, వారిపై ఫిర్యాదులు అనేకసార్లు వచ్చాయని, ఎన్నిసార్లు మందలించినా వైఖరి మార్చుకోకపోవడంతో బహిష్కరిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం ఏఐపిఎస్యు జిల్లా బాధ్యతలు బోడ అనిల్‌కు ఇస్తు నియమిస్తున్నామని పార్టీగా ప్రకటిస్తున్నామని తెలిపారు.

నేడు సీనియర్ సిటిజన్స్ ఫోరం సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం సర్వసభ్య సమావేశాన్ని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో బుధవారం నిర్వహి స్తున్నామని, డివిజన్ సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు దోండి నారాయణ, గౌరవ అధ్యక్షులు రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి గంగాధర్, ట్రెజరర్ ఎం.సాయన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కేంద్రం నుంచి సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని, ఇందులో సీనియర్ సిటిజన్స్ పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేస్తారని పేర్కొన్నారు. 60 ఏళ్లు పైబడిన ప్రభుత్వ ఉద్యోగులు, ఇతరులు ఈ సమావేశంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యారంగాన్ని ధ్వంసం చేసేలా ప్రభుత్వ చర్యలు

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్
- అట్టహాసంగా ఎస్ఎఫ్ఐ ఐదవ డివిజన్ మహాసభ



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు విగ్నేష్

నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని ధ్వంసం చేసేలా నిర్ణయాలు తీసుకుంటున్నాయని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్ విమర్శించారు. 5వ డివిజన్ మహాసభను పట్టణంలోని సివిఆర్ కాలేజీలో మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. కేంద్రం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేయాలని అన్నారు. ఈ మహాసభలో భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించామని భవిష్యత్తులో ఉద్యమాలను నిర్వహిస్తామని అన్నారు. నూతన డివిజన్ కమిటీ 15 మందితో ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు జవహర్ సింగ్, సిద్దల నాగరాజు, ఉపాధ్యక్షులు ముత్యం, నటేష్, కిరణ్, అర్జున్, అజయ్, రమ్య, మమత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

- పీ.ఓ, ఏ.పీ.ఓల శిక్షణ తరగతుల్లో కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మే 13న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లచే నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫెలిసిటేషన్ సెంటర్లు, పీ.ఓలు, ఏ.పీ.ఓలకు అందిస్తున్న హ్యాండ్ బుక్, శిక్షణ ఇస్తున్న తీరును పరిశీలించారు. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పోలింగ్ విధులు నిర్వర్తించిన సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎదుర్కొన్న పరిస్థితుల గురించి



మాట్లాడుతున్న కలెక్టర్

పలువురి నుంచి కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీ.ఓలు, ఏ.పీ.ఓ.లను ఉద్దేశించి కీలక సూచనలు చేశారు. శిక్షణ తరగతులను చక్కగా ఆకళింపు చేసుకుని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఇదివరకు ఎన్నికల విధులు నిర్వర్తించిన వారు సైతం ట్రైనింగ్ క్లాసులను తేలికగా తీసుకోకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల గురించి తెలుసుకోవాలని సూచించారు. పోలింగ్ డే సందర్భంగా పి.ఓ.లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి క్లుప్తంగా వివరించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన నియమావళి ప్రకారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. కొందరు పి.ఓ.లు శిక్షణకు రాకుండా అంతా తమకు తెలిసిందేనని అతి విశ్వాసంతో తప్పులు చేస్తారని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ రోజు ఈ.వి.ఎం.లు తీసుకొని పోలింగ్ డే పూర్తయిన తర్వాత సాయంత్రం కాగానే తిరిగి ఇవ్వవలసిన బాధ్యత పి.ఓలదేనన్నారు. 'పొలిటికల్ ఏజెంట్ మిమ్ములను ప్రశ్నించే అవకాశం ఉంటుంది. దానికి సమాధానం చెప్పాల్సింది పి.ఓ అధికారిదే పూర్తి బాధ్యత. పోలింగ్ డే రోజు మీరే బాస్ ఎవ్వరికీ బాధ్యత ఉండదని, పోల్ తర్వాత రిపోర్ట్ తయారు చేయాలి' అని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులున్నారు.

బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలి

- మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ప్రభాకర్

నవతెలంగాణ-ఆర్మూర్

నిజాంసాగర్ కాలువ తెగడం వల్ల నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుని 25 సంవత్సరాలుగా నివాసముంటున్న వీరందరికీ పట్టాలివ్వాలని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. సిపిఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ సంయుక్త మండలాల కమిటీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని 18వ వార్డు జర్నలిస్టు కాలనీలో గల తెగిపోయిన నిజాంసాగర్ కాలువను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాలువకు గండిపడి తెగిపోవడానికి ప్రధానంగా ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమేనని రాష్ట్ర ప్రభుత్వాన్ని గుర్తుచేశారు. మరోవైపు కాలనీలో ఉదయం 3 గంటల నుంచి ప్రవహిస్తున్న నీటిని మళ్లించడానికి అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించారని అన్నారు. సుమారుగా 25 సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో గుడిసెలు వేసుకొని మున్సిపాలిటీకి పన్ను కడుతూ నివసిస్తున్నారని, ట్యాక్స్ తీసుకోవడమే కానీ మంచి చెడులు చూసే విధానం ప్రభుత్వం వద్ద లేదని అన్నారు. కేవలం ఓట్లు వచ్చినప్పుడు మాత్రమే ఈ ప్రజలు గుర్తుకొస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు ఇంట్లోకి రావడంతో ఇంట్లో ఉన్న సామాన్లు బాసన్లు బియ్యం బట్టలు పూర్తిస్థాయిలో నష్టం వాటిల్లిందని తెలిపారు. దాచుకున్న డబ్బులు, బంగారం ఈ నీళ్ల ప్రమాదంలో కొట్టుకుపోయిందని అన్నారు. వెంటనే నష్టపోయిన వారికి పరిహారం రూ.20వేలు చెల్లించి, వారు నివసిస్తున్న ఇండ్లకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి దేవారం, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ముత్తెన్న, మండల కార్యదర్శి బి. కిషన్, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు నరేందర్, ఏఐకెఎస్ జిల్లా నాయకులు ఆకుల గంగారం, శేఖర్, పిఓడబ్ల్యు లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో అక్రమంగా నిలువ ఉంచిన పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తిప్పాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ బాబు తన ఇంట్లో అనుమతి లేకుండా అక్రమ18.64 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని నిలువ ఉంచినట్లు సమాచారం మేరకు డిప్యూటీ తహసీల్దార్ ఎన్ఫోర్స్మెంట్ కిష్టయ్య కలిసి పిడిఎస్ బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా అక్రమంగా పిడిఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచిన అట్టి వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



పట్టుకున్న బియ్యం

ఇసుక ట్రాక్టర్ సీజ్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

లింగంపేట మండలం పరమల్ల గ్రామం నుండి నాగిరెడ్డిపేట మండలం గోపాల్పేట్‌కు సోమవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై రాజు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ఓనర్ రమావత్ రమేష్, డ్రైవర్ రమావత్ లింబియాపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-భిక్కనూర్

రాజంపేట మండలంలోని శివాయిపల్లి గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలలో నవోదయ పరీక్ష ఫలితాలలో ఎంపికైన విద్యార్థులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో శాలువాతో సన్మానించి అభినందించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముదాం స్వామి, మాజీ సర్పంచ్ విట్టల్ రెడ్డి, మాజీ చైర్మన్ బాలరాజు, సెక్టొరియల్ ఆఫీసర్ శ్రీపతి, వేణు శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్/భీంగల్‌రూరల్

మండలంలోని బాగేపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపిఎం చిన్నయ్య, సిసి శివకుమార్ మంగళవారం ప్రారంభించారు. రైతులు పండించిన పంటను దళారులకు విక్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి మద్దతు ధరను పొందాలని వారు రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, సుచరిత, గంగామణి, సీసీలు భాస్కర్, శ్యామల, కృష్ణ, రాజయ్య, సునీత, కార్యదర్శి శ్రీకాంత్, రైతులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

దండిగుట్టలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

మండలంలోని దండిగుట్ట గ్రామంలో గ్రామ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపిఎం చిన్నయ్య, సీసీ భాస్కర్, గ్రామ కార్యదర్శి గౌతమి ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించి రైతులు లాభాలను పొందాలని వారు సూచించారు. కార్యక్రమంలో మండల సమైక్య సభ్యులు సుచరిత, గంగామణి, సీసీలు శ్యామల, రాజయ్య కృష్ణ, గ్రామ సంఘం అధ్యక్షురాలు సౌజన్య, డ్వాక్రా మహిళలు రైతులు పాల్గొన్నారు.

భీంగల్ రూరల్ : మండల కేంద్రంలోని బాబాపూర్ గ్రామంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాడే మురళి ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రాడే మురళి మాట్లాడుతూ.. ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు.



భీంగల్ రూరల్ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాడే మురళి

ముందుగా చెల్లిస్తే ఇంటి పన్నులో మినహాయింపు

నవతెలంగాణ-భీంగల్

మున్సిపల్ పట్టణ కేంద్రంలోని నివాస గృహాల యజమానులు, వ్యాపార సముదాయ యజమానులు 2024-25 సంవత్సరపు మున్సిపల్ పన్నును ముందుగా చెల్లిస్తే మినహాయింపు ఉంటుందని కమిషనర్ రామకృష్ణ తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన పన్నులను ఈనెల 30లోపు చెల్లిస్తే ఐదుశాతం రాయితీ లభిస్తుందని, కనుక వీటిని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ తెలిపారు.

పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



పొగాకు కొనుగోళ్లను ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి, బోర్గం గ్రామాలలో వజీర్ సుల్తాన్ టుబాకో కంపెనీ యాజమాన్యం మంగళవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. గత సంవత్సరం 10,500 క్వింటాలుకు ధర నిర్ణయించగా.. ఈ ఏడాది ఖర్చులు విపరీతంగా పెరిగాయని రైతులు యాజమాన్యంతో తమ ఇబ్బందులను తెలియజేయగా.. ఈ ఏడాది 13,800లుగా ధరను నిర్ణయించారు. కార్యక్రమంలో విఎస్‌టి కంపెనీ ఉపాధ్యక్షులు అజయ్, ఏరియా మేనేజర్ కృష్ణారావు, భయ్యా అల్తాఫ్ హుస్సేన్, సాయిలు, స్థానిక రైతులు మీర్జా కలీం బేగ్, నీలా సింగిల్విండో చైర్మన్ ఇమామ్ బేగ్, గుజ్జ రమేష్, అఫ్రోజ్ బేగ్, సాయిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.